# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక




పాఠకులు, ప్రకటనకర్తలు,
శ్రేయోభిలాషులకు, ప్రభాత ఉదయం
**విజయ దశమి (దసరా)**
**శుభాకాంక్షలు**
దసరా సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం సంచిక వెలువడదు. పునర్ధర్శనం శనివారం.
ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


సంపుటి: 3 | సంచిక: 40 | పేజీలు: 5 | వెల: రూ.4/- | గురువారం 2 అక్టోబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




# వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం

- అదే ఆర్ఎస్ఎస్ మార్గం: ప్రధాని మోదీ
- ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని
- వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే సంస్థ అని కొనియాడిన ప్రధాని
- 'నేను' నుంచి 'మనం' వైపు నడిపించే స్ఫూర్తిదాయక సంస్థగా అభివర్ణన
- సంఘ్ పై ఎన్నో కుట్రలు జరిగినా ఎదుర్కొని నిలబడిందని వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (నమస్తే ఉదయం)

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనేది కేవలం ఒక సంస్థ కాదని, వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే ఒక మహోన్నత శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'నేను' అనే అహాన్ని వీడి 'మనం' అనే సామూహిక భావన వైపు నడిపించే స్ఫూర్తిదాయక ప్రయాణమే సంఘ్ అని ఆయన అభివర్ణించారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో ుధవారం జరిగిన ..మిగతా 2లో

# జూబ్లీహిల్స్ ఎన్నికపై రేవంత్ కసరత్తు

## సిఎంతో మంత్రులు, పిసిసి చీఫ్ భేటీ

## గెలుపు గుర్రాల అవకాశాలతో జాబితాకు సిఎం ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే ఉదయం)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన కసరత్తును కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌తో పాటు జూబ్లీహిల్స్ ఎన్నిక షెడ్యూల్ కూడా వస్తుంది కాబట్టి.. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థి ఎంపికపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే బుధవారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థులతో పాటు జూబ్లీహిల్స్ అభ్యర్థిపై చర్చ జరిగింది. ఈ నెల 6న ఏఐసీసీలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో స్క్రీనింగ్ కమిటీ సమావేశంకు ముందే అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.జూబ్లీహిల్స్ ఉ పఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని ముగ్గురు మంత్రులకు ఆయన సూచించారు. తాజా రాజకీయ పరిస్థితులను వివరిస్తూ.. నివేదికలో అభ్యర్థుల పేర్లు, వివరాలు ఉండాలని పేర్కొన్నారు. గెలుపు గుర్రాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిలబెట్టాలన్న కోణంలోనే నివేదిక ఉండాలని సీఎం పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికశాతం స్థానాలను కైవసం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ అంశంలో ఇన్‌ఛార్జ్ మంత్రులతోపాటు ఎంపీల భాగస్వామ్యంతో వెళ్లాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా సమావేశమై ఈ అంశంపై చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, తుమ్మల నాగేశ్వర రావు జిల్లా ఇన్‌ఛార్జిలుగా ..మిగతా 2లో



# తెలంగాణలో శాంతి భద్రతలకు పెద్దపీట

## సమర్థంగా స్థానిక ఎన్నికల నిర్వహణ



- సాంకేతికతను ఉపయోగించుకుని వెళతాం
- తెలంగాణలో శాంతి భద్రతలకు పెద్దపీట
- ఖాళీల భర్తీని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతా
- నూతన డిజిపిగా బాధ్యతలు చేపట్టిన శివధర్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే ఉదయం)

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నూతన డిజిపిగా బాధ్తయలు స్వీకరించిన శివధర్ రెడ్డి తెలిపారు. మాకు బలమైన జట్టు ఉంది. క్షేత్రస్థాయిలో సాంకేతిక తను వినియోగించుకుంటాం అన్నారు. రాష్ట్రంలో పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని నూతన డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. నూతన డీజీపీగా ఆయన లక్డీకపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వేద మంత్రాలతో డీజీపీ కార్యాలయంలోకి ఆయన్ను పండితులు ఆహ్వానించారు. తెలంగాణ 6వ డీజీపీగా 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నూతన ..మిగతా 2లో

# మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కన్నుమూత



వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో ఐటీ శాఖ మంత్రి

2




# వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం



మొదటి పేజీ తరువాయి...

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ కు ఎన్నో అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ, వాటన్నింటి లక్ష్యం ఒకటేనని, అదే 'జాతికే ప్రథమ స్థానం' అని స్పష్టం చేశారు. ఏ రెండు అనుబంధ సంస్థల మధ్య వైరుధ్యాలు ఉండవని ఆయన పేర్కొన్నారు. సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దేశ నిర్మాణం అనే బలమైన సంకల్పాన్ని తీసుకున్నారని మోదీ గుర్తుచేశారు. ప్రతి పౌరుడిలో దేశం పట్ల బాధ్యత పెరిగినప్పుడే దేశం బలోపేతం అవుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. అందుకే వ్యక్తి వికాసానికి ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. నేటికీ సంఘ్ శాఖల్లో ఈ వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ కనిపిస్తుందని, ఇవి శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలకు దోహదపడే పవిత్ర వేదికలని ప్రధాని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో డాక్టర్ హెడ్గేవార్ సహా ఎందరో సంఘ్ కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని మోదీ గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా సంఘ్ పై అనేక దాడులు, కుట్రలు జరిగాయని ఆయన అన్నారు. సంస్థను అణచివేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని, కానీ వాటన్నింటినీ సంఘ్ ఎదుర్కొని నిలబడిందని తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా స్వయంసేవకులు ఎన్నడూ ద్వేషానికి ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



## మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కన్నుమూత

### వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో ఐటీ శాఖ మంత్రి

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే ఉదయం)

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి (73) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దామోదర్ రెడ్డి హైదరాబాద్ లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ నెల 4న సాయంత్రం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో దామోదర్ రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దామోదర్ రెడ్డి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిం చారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో ఐటీ శాఖ మంత్రిగా పనిచేశారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూ రాలని ప్రార్థించారు. దామోదర్ రెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. వారి కుటుంబానికి ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని సీఎం రేవంత్ కోరుకున్నారు. మాజీ మంత్రి మృతికి మంత్రి పొంగులేటి సంతాపం తెలిపారు. ప్రజా ప్రతినిధిగా మాత్రమే కాకుండా, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడు దామోదర్ రెడ్డి అని కితాబిచ్చారు. ఐటీ శాఖ మంత్రిగా దూరదృష్టితో పని చేసి తెలంగాణ సహా ఆంధ్రప్రదేశ్‌లో ఆ రంగ అభివృద్ధికి బలమైన పునాది వేశారని ప్రశంసించారు. యువతకు అవకాశాలు కల్పించడంలో దామోదర్ రెడ్డి పాత్ర స్ఫూర్తిదాయకమన్నారు. ధైర్యం, రాజకీయ దూరదృష్టి, నిస్వార్థ సేవలు ఆయన రాజకీయ జీవనంలో ప్రధాన లక్షణాలు అని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజలతో కలిసిమెలిసి జీవిస్తూ వారి కోసమే పని చేయడం ఆయన వ్యక్తిత్వానికి ప్రత్యేకత అన్నారు. దామోదర్ రెడ్డి ఆకస్మిక మరణం కాంగ్రెస్‌కే కాకుండా తెలంగాణ రాజకీయాలకు కూడా తీరని లోటన్నారు. ఆయన స్ఫూర్తిదాయకమైన జీవితం, ప్రజాసేవ పంథా భవిష్యత్ తరాలకు మార్గదర్శకమన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు వారికి ధైర్యం ప్రసాదించాలని కోరుకున్నారు మంత్రి పొంగులేటి.

## జూబ్లీహిల్స్ ఎన్నికపై రేవంత్ కసరత్తు

మొదటి పేజీ తరువాయి...

ఉన్నారు. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జిలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలానే గెలుపు కోసం అనుసరించే ప్రణాళికలను కూడా సిద్ధం చేయాలని సూచించారు. ఇక్కడ బీసీ అభ్యర్థిని రంగంలోకి దించుతారా? లేదా ఓసీకి అవకాశం ఇస్తారా? అన్నది ఇంకా క్లారిటీ లేదు. బీసీ కోటాలో అంజాన్ కుమార్ యాదవ్, నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్ రేసులో ఉన్నారు. రెడ్డి కోటలో సీఎస్ రెడ్డి, రంజిత్ రెడ్డిలు ఉన్నారు.

## తెలంగాణలో శాంతి భద్రతలకు పెద్దపీట

మొదటి పేజీ తరువాయి...



డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ డీజీపీగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పోరాట మార్గం వీడేందుకు సిద్ధమని ఇటీవల నక్సల్స్ నేత లేఖ రాశారు. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని వారిని కోరుతున్నాం. మావోయిస్టుల సిద్ధాంతాలు ఆచరణలో విఫలమయ్యాయని భావిస్తున్నాం. లొంగిపోయిన వారికి అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్రంలో పోలీసుస్టేషన్ల సంఖ్య కంటే పోలీసుల్లో నైపుణ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. పోలీసు శాఖ ప్రత్యేక విభాగాల్లోని ఖాళీలను నిపుణులతో భర్తీ చేస్తాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణలో శాంతి భద్రతలు కాపాడం మా మొదటి కర్తవ్యం. తెలంగాణ అభివృధికి, పెట్టుబడులు రాకకు లా అండ్ ఆర్డర్ ఎంతగానో దోహదపడుతుంది. మా ముందు ఉన్న లక్ష్యం స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించడం. మీడియా సహకారం చాలా అవసరం. పోలీస్ శాఖలో 17 వేల పోస్టులు ఖాళీ ఉన్నాయి, వాటిని భర్తీ చేయాలి. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవడండి. మావోయిస్టులపై నమోదు అయిన కేసులు విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తా. మావోయిస్టుపై వేధింపులు ఉండవు. ప్రభుత్వం ముందు మీరు ఆత్మసమర్పణ చేసుకోండి, ముందుకు రండి. మావోయిస్టు పార్టీ నుండి బయటికి రండి. మావోయిస్టు పొలిట్ బ్యూరో సుజాత ఇటీవలే మావోయిస్టు పార్టీని వీడారు. వేణుగోపాల్ ఇచిన స్టేట్మెంట్ జగన్ ఖండించారు. మావోయిస్ట్ నేత జగన్ ఇచిన స్టేట్మెంట్ అందరూ చూసాం. వీరి మధ్యలో సమస్యలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం మావోయిస్టులకు అందించాల్సిన బెనిఫిట్స్ అందిస్తాం. సైబర్ క్రైమ్ నేరాలు అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. పోలీస్ సిబ్బంది స్కిల్స్ పెంచుతాం. బేసిక్ పోలింగ్ అండ్ విజువల్ పోలీసింగ్ మానిటరింగ్ సిస్టమ్ ఇంప్రూవ్ చేస్తాము' అని కొత్త డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు.



## వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

### రథోత్సవంలో ఊరేగిన మలయప్పస్వామి

తిరుమల, అక్టోబర్ 1 (నమస్తే ఉదయం)

శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహా రథోత్సవాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తిరుమాడ వీధుల్లో విహరించారు. గోవింద నామస్మరణతో భక్తులు రథాన్ని లాగారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు పారవశ్యంతో.. గోవిందానామస్మరణతో వీధులు మార్మోగాయి. స్వామివారికి కర్పూర హారతులిచ్చి? నైవేద్యాలు సమర్పించారు. అనాది నుంచి రాజులకు రథసంచారం ఆనవాయితీగా వస్తోంది. తిరుమల మాడ వీధుల్లో శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తున్నాడు. బ్రహ్మోత్సవాల సమయంలో జరిగే ఈ రథోత్సవం ప్రసిద్ధమైంది. తిరుమాఢ వీధుల్లో రథంపై ఊరేగుతున్న శ్రీనివాసునికి భక్తితో నమస్కరిస్తూ ఓం నమో వేంకటేశాయ నామస్మరణ చేస్తున్నారు భక్తులు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజైన బుధవారం ఉదయం 7 నుండి 9 గంటల వరకు ఉభయదేవేరులతో కూడిన శ్రీమలయప్పస్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. బ్రహ్మోత్సవాలలో ఎనిమిదో రోజున ఉభయ దేవేరులతో మలయప్పస్వామిని మహోన్నత రథంపై అధిష్ఠింపజేసి ఆలయ వీధులలో విహరింపజేశారు. శ్రీవారికి భక్తులు అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. గోవిందనామస్మరణతో ఆలయ మాడవీధులు మారుమోగాయి. అనాదికాలం నుండి రాజులకు రథసంచారం ప్రసిద్ధం. యుద్ధాలలో కూడా విరివిగా రథసంచారం జరిగినట్లు భారతాది గ్రంథాలు వివరిస్తున్నాయి. శ్రీహరి గరుడధ్వజుడై నాలుగు గుర్రాలతో కూడిన రథంపై విహరిస్తాడు. ఇక ప్రసిద్ధ దేవాలయాలలో ఉత్సవవేళలో దేవుని ఉత్సవమూర్తిని రథంపై ఉంచి ఊరేగించే ఆచారం, ఆగమశాస్త్ర సిద్ధమై బహుళ ప్రచారంలో ఉంది. తిరుమలలో రథోత్సవం అన్నివిధాలా ప్రసిద్ధమైంది. 'రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మనవిద్యతే ' అన్న ఆర్షవాక్కులు రథోత్సవం మోక్షప్రదాయకమని వివరిస్తున్నాయి. తిరుమాడ వీధులలో రథాన్ని లాగేటప్పుడు ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. రథానికి తాళ్ళుకట్టి వీధులలో భక్తులు, అధికారులు అందరూ రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవానికి విశిష్టమైన ఆధ్యాత్మికార్థం ఉంది. కఠోపనిషత్తులో ఆత్మకు, శరీరానికీ ఉండే సంబంధాన్ని రథరూపకల్పన తో వివరించడం జరిగింది. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూలశరీరం వేరనీ, సూక్ష్మశరీరం వేరనీ, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. భక్తులు రథాన్ని లాగుతారు, కానీ, అన్నమయ్య సకలజీవులలో అంతర్యామిగా ఉన్న పరమాత్మ తనరథాన్ని తానే లాగుతున్నాడని అనడం సముచితం. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, పలువురు బోర్డు సభ్యులు, జెఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో మురళి కృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు




హైదర్ గూడ లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శివరాంపల్లి లో బతుకమ్మ ఆడుతున్న రాజేంద్రనగర్ కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్



అమ్మ వారిని దర్శించుకున్న కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్ దంపతులు



పెద్ద తాళ్ళ కుంట వద్ద బతుకమ్మ తో మహిళ

బుద్వేల్, అక్టోబరు 2 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ లో సద్దుల బతుకమ్మ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. రంగు రంగు పూలతో అలంకరించిన బతుకమ్మలను మహిళలు పెద్ద తాళ్ల కుంట లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా హైదర్ గూడ ప్రణవ భక్త సమాజం అధ్వర్యంలో బతుకమ్మలు అడుతు వచ్చిన మహిళలకు స్వాగతం పలికారు. అత్తాపూర్ కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్, బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య మహిళలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

**శివరాంపల్లి లో బతుకమ్మ ఆడి అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్ :**

రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ఆమె బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

# బీదలకు నిత్యవసర సరుకులు అందజేసిన ట్రాన్ జెండర్లు

కొత్తకోట, అక్టోబర్ 1 (ప్రభత ఉదయం)

వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో దసరా పండుగని పురస్కరించుకొని బుధవారం నిరుపేదలకు రెండు నెలలకు సరిపడ నిత్యవసరాల సరుకులను ట్రాన్ జెండర్లు, అందజేశారు. ఈ సందర్భంగా కొత్తకోట మండల ట్రాన్ జెండర్ అధ్యక్షులు డి. రేవతి నాయక్ మాట్లాడుతూ భగవంతుడు మాకు కలగజేసిన దానిలో మేము నిరుపేదలకు సహాయం చేయాలని కృత నిశ్చయముతో ఈ కార్యక్రమం చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్బంగా బీదా కుటుంబ సభ్యులు, ప్రజలు ట్రాన్ జెండర్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.





జనగామ మున్సిపాలిటీలోని 2 వార్డ్‌లో మొత్తం చెత్త చెదారం నిండిన దృశ్యం

## జనగామ మున్సిపాల్టిలో పారిశుద్యం అస్తవ్యస్తం

### చెత్తా చెదారం దుర్గంధంతో నిండిపోయిన మోరీలు పట్టించుకునే నాధుడే లేడు

జనగామ, అక్టోబర్ 01 (నమస్తే ఉదయం) : జనగామ మున్సిపాలిటీ లోని రెండవ, మూడవ వార్డులలోని సూర్యాపేట రోడ్డు ఆయుష్మాన్, ప్రీతి కిడ్నీ హాస్పిటల్స్ బ్యాక్ సైడ్ మోరీలు మొత్తం మట్టి, చెత్తా చెదారంతో నిండిపోయి నీరు పైకి ఉబికి వస్తూ తీవ్రమైన దుర్గంధం మురుగువాసనతో కంపు కొడుతున్నది. దోమలు 24 గంటలు స్వయిర విహారం చేస్తున్నాయి కనీసం మోరీలు సాపు చేసే పరిస్థితి జనగామ మున్సిపాలిటీలో లేదు.మోరిల పక్కన ఏపుగా గడ్డి పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అనేకమంది ప్రజలు పరిసరాల అపరిశుభ్రం వల్ల జ్వర పీడితులు అవుతున్నారు. అలాగే ఇటీవల సూర్యపేట రోడ్డుకు అనేక ఆసుపత్రులు గెలిచాయి ఈ ఆసుపత్రులకు వచ్చే ప్రజలు రోగులు పరిసరాలు అపశుభ్రం వల్ల వారి జబ్బులు మరింత తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కావున వెంటనే మున్సిపల్ కమిషనర్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ స్పందించి చెత్తాచెదారంతో పేరుకు పోయిన మోరీలను సాఫ్ట్ చేయించి దోమల నివారణ చర్యలు చేపట్టి ప్రజలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి కాలనీవాసులు గుండు శ్రీనివాస్ మాచర్ల ప్రభాకర్ కృష్ణారెడ్డి రిటైర్డ్ టీచర్ ఆర్ లక్ష్మణ్ తదితరులు డిమాండ్ చేశారు.




కొయ్యడ ప్రభాకర్- లక్ష్మి దంపతులు కుమారులతో

## తమ చిన్న కుటుంబంలో కలెక్టర్, గ్రూప్-1 అధికారి

### హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

జనగామ, అక్టోబర్ 01 (నమస్తే ఉదయం) : ఎంతో కష్టపడి చదివి తమ కుమారులు ప్రయోజకలైనారని జనగామ జిల్లాలోని రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ప్రభాకర్ ,లక్ష్మి దంపతులు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తమ పెద్ద కుమారుడు కొయ్యడ ఉదయ్ కుమార్ గ్రూప్-1లో విజయము సాధించి గ్రేడ్ - %××% మున్సిపల్ కమీషనర్ గా ఎంపికయ్యాడని, చిన్న కుమారుడు కొయ్యడ ప్రణయ్ కుమార్ యుపిఎస్సి లో ఉత్తమ ర్యాంక్ సాధించి తెలంగాణ క్యాడర్ కి ఐఏఎస్ గా ఎంపికై తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేట జిల్లాలో జిల్లా అదనపు కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నాడని, మరో కుమారుడు కొయ్యడ పృథ్వి కుమార్ న్యాయవాద చదువును కొనసాగిస్తున్నాడని ఆనందం వ్యక్తం చేశారు. తమ సంతానమైన ముగ్గురు కుమారులు ఎంతో మందికి ఆదర్శంగా ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. జనగామ జిల్లా నుంచి పెద్ద ఉద్యోగాలు సాధించి దేశ సేవలో ముందు ఉన్న తమ కుటుంబానికి శుభకాంక్షలు తెలిపి తమకు సహకరించిన గ్రామ, జిల్లా ప్రజలు, మిత్రులు, శ్రేయోభిలాషులకు వారు ధన్యవాదాలు తెలిపారు.



జనగామ డీసీపీ ఆధ్వర్యంలో

## డ్రంక్ అండ్ డ్రైవ్

### మద్యం త్రాగి వాహనాలు నడపవద్దు

### వరంగల్ వెస్ట్ జోన్ డీసీపీ రాజామహేంద్రనాయక్

జనగామ, అక్టోబర్ 01 (నమస్తే ఉదయం) : దసరా పండగ సందర్భంగా ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమీషనర్ (సిపి) ఆదేశాల మేరకు వరంగల్ వెస్ట్ జోన్ జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రం అంబేడ్కర్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేసి వాహన శోదకుల పట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో జనగామ సీఐ సత్య నారాయణ రెడ్డి, ఎస్ఐలు చెన్నకేశవులు, రాజేష్ మరియు సిబ్బంది పాల్గొని మద్యం త్రాగి వాహనాలు నడిపిన పలువురి పై కేసులు నమోదు చేశారు.



# ఎంపీటీసీ, జడ్పిటిసి, సర్పంచులు, వార్డ్ సభ్యుల ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

### వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచన

### రెండు విడతలు గా ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలు.

### రెండు విడతలుగా సర్పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నికలు.

### జనగామ, స్టేషన్ఘన్పూర్ మున్సిపాలిటీలలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉండదు



జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీ నేతలతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్

జనగామ, అక్టోబర్ 01 (నమస్తే ఉదయం): జిల్లా కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు, సర్పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నికలపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పింకేష్ కుమార్ తో కలిసి బుధవారం జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో, సంబంధిత నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈనెల ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు సర్పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నికలకు ఈనెల 29న షెడ్యూల్ ప్రకటించినందున ఎంపీటీసీ జడ్పిటిసి మొదటి విడత పోలింగ్ 23వ తేదీన, రెండవ విడత పోలింగ్ 27వ తేదీన నిర్వహించనున్నామన్నారు. ఓట్ల లెక్కింపు నవంబర్, 11 వ తారీకు ఉంటుందన్నారు.అలాగే గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా ఉందని, జనగామ జిల్లాలో రెండు, మూడు విడత లు మాత్రమే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.రెండో విడత పోలింగ్ నవంబర్ 4వ తేదీ న, మూడో విడత నవంబర్ 8వ తేదీన పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా విడతల ప్రకారంగా పోలింగ్ నిర్వహించిన రోజునే ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.జిల్లాలోని 12 మండలాలలో ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నందున గ్రామీణ ప్రాంతాలలోనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉంటుందన్నారు.జనగామ, స్టేషన్ఘన్పూర్ మున్సిపాలిటీలలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉండదన్నారు.జడ్పిటిసి 12 మండలాలలో 12 స్థానాలు కాగా, ఎంపీటీసీ 134 స్థానాలకు గాను 783 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.మొదటి విడత 6 మండలాలైన దేవరుప్పల, పాలకుర్తి, కొడకండ్ల, లింగాల ఘనపూర్, చిల్పూర్, ఘన్పూర్ స్టేషన్ లలో 70 ఎంపీటీసీ స్థానాలకు 417 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.రెండవ విడతలో 6 మండలాలైన బచ్చన్నపేట జనగామ నర్మెట్ట తరిగొప్పుల రఘునాథపల్లి జాఫర్గడ్ మండలాలకు 64 ఎంపీటీసీ స్థానాలకు గాను 366 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా నవంబర్ 4వ తేదీన నిర్వహించే పోలింగ్ కు 6 మండలాలైన దేవరుప్పల పాలకుర్తి కొడకండ్ల లింగాల గణపూర్ చిల్పూర్ ఘన్పూర్ స్టేషన్ లలోని 144 గ్రామపంచాయతీలోని 1310 వార్డులకు, అదేవిధంగా నవంబర్ 8వ తేదీన పోలింగ్ నిర్వహించే ఆరు మండలాలైన బచ్చన్నపేట, జనగామ, నర్మెట్ట, తరిగొప్పుల, రఘునాథపల్లి, జాఫర్గడ్ మండలాలలోని 136 గ్రామపంచాయతీలోని 1224 వార్డులకు పోలింగ్ జరుగుతుందన్నారు.జిల్లాలో మొత్తం 4,01,496 ఓటర్లు ఉన్నారని అందులో మహిళలు 2,02,963 ఓటర్లు ఉండగా పురుషులు 1,98,525 ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రతి మండలానికి ఎఫ్.ఎస్.టి బృందం ఏర్పాటు, జోనల్ అధికారులుగా 41 మందిని నియమించడం జరిగిందన్నారు..జిల్లాలో నాలుగు లక్షల 83 వేల 231 బ్యాలెట్ పేపర్లు అవసరం ఉండగా ఐదు లక్షల 756 బ్యాలెట్ పేపర్లు ఉన్నాయన్నారు. బ్యాలెట్ బాక్సులు ఉన్నాయని సిబ్బంది కి ఎన్నికల విధులు కేటాయించడం జరిగిందని ఎన్నికల నిర్వహణకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.సమావేశాల నిర్వహణ కొరకు, ఎన్నికల ప్రచార సామాగ్రి ముద్రణ, ర్యాలీల నిర్వహణ కొరకు ముందస్తు అనుమతి పొందాలన్నారు. పోలింగ్ నిర్వహణలో పాల్గొనే వివిధ పార్టీల ఏజెంట్ లు గుర్తింపు కార్డులు పొందాలన్నారు. ఎన్నికలను సజావుగా జరిగేందుకు వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలన్నారు.ఈ అఖిలపక్ష పార్టీ ప్రతినిధుల సమావేశంలో ప్రతినిధులు కాంగ్రెస్ బృంగి భాస్కర్, బి.ఆర్.ఎస్. రావెల రవి, సిపిఎం జోగు ప్రకాష్, బి.ఎస్.పి తాంద్ర అఖిల్, బి.జె.పి. జగదీష్, జడ్పీ డిప్యూటీ సీఈవో సరిత, జిల్లా పంచాయతీ అధికారిణి స్వరూప, ఎన్నికల నోడల్ అధికారులు విక్రమ్ కుమార్, చంద్రశేఖర్, వెంకటరెడ్డి,రఘు, కలెక్టర్ కార్యాలయ ఏవో శ్రీకాంత్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ

# అభివృద్ధికి 50 కోట్లు మంజూరు

### మారనున్న మున్సిపాలిటీ రూపురేఖలు

### త్వరితగతిన తగు చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ, అక్టోబర్ 01( నమస్తే ఉదయం):జిల్లా లోని స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీకి రానున్న రోజులలో రూపురేఖలు మారనున్నాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.మున్సిపాలిటీ అభివృద్ధికి 50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిన నేపథ్యంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం సంబంధిత అధికారులతో కలెక్టరెట్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఘనపూర్ మున్సిపాలిటీ కార్యాలయ భవనం, టౌన్ హాల్, ఇంటిగ్రెటెడ్ మార్కెట్, సెంట్రల్ లైట్,సిసి రోడ్లు, డ్రైన్లు, వైకుంఠ దామం, జంక్షన్ అభివృద్ధి పనులు,రోడ్డు వెడల్పు వంటి పనులకు 50కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు.

ఈ క్రమం లో అభివృద్ధి పనులకి సంబందించిన అంచనాలను తొందరగా తయారు చేయాలనీ రెవిన్యూ, మున్సిపల్, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.డ్రైనిజీ వ్యవస్థ పునరనిర్మాణం,తాగు నీరు, సెంట్రల్ లైటింగ్ పనులను అంచనా వేసి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఏర్పాటు కు స్థలాన్ని పరిశీలించి.,సంబంధిత అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు గల నివేదికను త్వరగా సమర్పించాలని స్టేషన్ ఘనపూర్ తహసీల్దార్ ని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో జనగామ, స్టేషన్ ఘన్పూర్ ఆర్డీఓ లు గోపిరామ్, డి.ఎస్.వెంకన్న, స్టేషన్ ఘన్పూర్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ హరి హరక్షేత్రంలో మహిషాసుర మర్దిని దేవీ అలంకరణలో కొలువు దీరిన అమ్మవారు

## మహిషాసుర మర్ధినిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

బుద్వేల్, అక్టోబరు 1 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శ్రీ దేవీ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. దేవాలయాలు, బస్తీలలో అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. రాజేంద్రనగర్ హరిహర క్షేత్రం లో బుధవారం అమ్మవారు శ్రీ మహిషాసుర మర్ధినిదేవీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వందల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పుజారి అనం తాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక లలితా సహస్రపారాయణం నిర్వహించారు. గురువారం శ్రీ రాజరాజేశ్వరీ దేవీ అలంకరణ, దసరా వేడుకలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



కిస్మత్పూర్ విద్యుత్ సబ్టేషన్ వద్ద ఆయుధ పూజ పూజలు చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్



హిమాయత్ సాగర్ విద్యుత్ సబ్టేషన్ లో ఆయుధపూజ పూజలు చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ అమర్ సింగ్



కాటేడాన్ విద్యుత్తు సబ్ స్టేషన్ వద్ద ఆయుధపూజ చేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్

## విద్యుత్ సబ్ స్టేషన్‌ల వద్ద ఘనంగా ఆయుధ పూజలు

రాజేంద్రనగర్, అక్టోబర్ 1(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలో గల వివిధ సెక్షన్లలో ఆయుధ పూజలు ఘనంగా నిర్వహించారు. హిమాయత్ సాగర్ విద్యుత్ సబ్టేషన్ వద్ద ఏ ఈ అమర్ సింగ్, లైన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కిస్మత్పూర్ విద్యుత్ సబ్టేషన్ వద్ద అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్, సబ్ ఇంజనీర్ విశ్వేశ్వర్, రమేష్, శివరాంపల్లి విద్యుత్ సబ్టేషన్ వద్ద అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్, లైన్మెన్ ప్రసాద్, ఆర్టిజన్ కిషోర్, కాటేడాన్ విద్యుత్ సబ్టేషన్ వద్ద అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆయుధ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో లైన్స్పెక్టర్ రాజారావు, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, సబ్ ఇంజనీర్ వెంకట్, గౌస్, రామ్ రెడ్డి , విద్యుత్ సిబ్బంది అనిల్, నరేష్, సుధాకర్, అజ్మత్, హర్షవర్ధన్, కుమార్, కిషోర్, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.



ఈ ఈ నరేందర్ గౌడ్ ను కలసి విన్న వించుకుంటున్న బీజేపీ నాయకులు వై శ్రీధర్, పి మల్లేష్ యాదవ్ తదితరులు

## పత్తికుంట కొలనును శుభ్రం చేయని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి: బీజేపీ

బుద్వేల్, అక్టోబరు 1 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ పత్తికుంట వద్ద గల కొలను ను శుభ్రం చేయకపోవడంతో బతుకమ్మ లు వేయడానికి మహిళలకు తీవ్ర ఇబ్బంది. కలిగిందని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి. మల్లేశ్ యాదవ్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్లు అన్నారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా వత్తికుంట కొలను ను శు భ్రం చేసే పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ సరిగ్గా పనులు చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందని గుర్తు చేశారు. ఇదే విషయమై రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం ఈఈ నరేందర్ గౌడ్ ను స్వయంగా కలిసి విన్నవించుకున్నామని, డిప్యూటీ కమిషనర్ కు వినతి పత్రం అం దజేశామన్నారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా కొలను ను శుభ్రం చేసే కాంట్రాక్టు పొందిన వ్యక్తి వినాయక విగ్రహాలను తీయకుండానే పనులు వదిలివేశాడని, దాంతో కొలను లో మట్టి, సీకులు అలానే ఉన్నాయన్నారు. వాటిని పూర్తిగా తీసివేసి బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి మంచినీటితో నింపాలని అధికారులను కోరినా, వారు పటించుకోకపోవడం బాధాకరమన్నారు. రాజేంద్రనగర్ ఈఈ గా ఉన్న నరేందర్ గౌడ్ ఐదు సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నారని, ఆయనకు అన్ని విషయాలు తెలుసని అయినా ఆయన కూడా పట్టించుకోకపోవడం బాదాకరమన్నారు. పత్తికుంట కొలను వద్ద కాంట్రాక్టు పొంది పనిచేయని వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దక్షిణ మండలం జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఈఈ లను కోరారు. అధికారులను కలసిన వారిలో బీజేపీ నాయకులు కోరని సదానంద్, బండారి బాలక్రిష్ణ, పి.రవీం దర్, ఈ వేణుగోపాల్ తదితరులున్నారు.

### అనుమానస్పద స్థితిలో

## ఓ యువతి ఆత్మహత్య



బుద్వేల్, అక్టోబరు 1 (నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ బస్తీలో బుధవారం ఓ యువతి తన గదిలో ప్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కారణాలు తెలియరాలేదు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. హైదర్ గూడ కు చెందిన బండారు రమేశ్ కూతురు బండారి యశిక (29) విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించారు. ప్రస్తుతం నగరం లో సాఫ్టేర్ గా మంచి ప్యాకేజీలో ఉ ద్యోగం చేస్తున్నారు. బుధవారం మద్యాహ్నం హైదర్ గూడ లోని తమ నివాసంలో తన గదిలో ప్యాన్ కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు ధృవీకరించారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉ స్మానియా మార్చ్యురీకి తరలించారు. కేసు దర్యాప్తు లో ఉంది.

## రాజేంద్రనగర్ పట్టణ ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు

బుద్వేల్, అక్టోబరు 1 (నమస్తే ఉదయం): రాజేద్రనగర్ పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ విజయ దశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ దేవీ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని వేడుకున్నానన్నారు. ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్దేవుపల్లి డివిజన్ల కార్పొరేటర్ లు పి.అర్చన జయప్రకాశ్, మోండ్ర సంగీత గౌరీశంకర్, తోకల శ్రీనివాస్రెడ్డి, మాజీ కార్పొరేటర్లు టి.ప్రేందాస్ గౌడ్, కోరని శ్రీలత మహాత్మా, నాయకులు వై. శ్రీధర్, పి.మల్లేశ్ యాదవ్, మేకల వనితా దామోదర్ రెడ్డి, పసుపుల సందీప్ ముదిరాజ్, ఎం.కొమురయ్య, ఎం.రామేశ్వర్రావు, అక్కెం రాఘవేందర్ యాదవ్. ఎస్ వెంకటేశ్, సోమ శ్రీనివాస్ గుప్తా, సంకూరి జయప్రకాశ్, పి.హరిచరణ్ గౌడ్, చేలారాం చౌదరిలు ఉన్నారు.





## హైదర్‌గూడలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

బుద్వేల్, అక్టోబరు 1 (నమస్తే ఉదయం) : హైదర్ గూడ లో బుధవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ వేడుకలలో పాల్గొన్నారు.

## నీటి సంపులో పడి ఓ మహిళ మృతి



బుద్వేల్, అక్టోబరు 1 (నమస్తే ఉదయం) నీటి సంపులో పడి ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ సంఘటన బుధవారం సాయంత్రం లక్ష్మీగూడ వాంబే కాలనీలో జరిగింది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి... లక్ష్మీగూడ వాంబే కాలనీకి చెందిన రాములు భార్య అనిత (48) ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మరణించింది. మైలార్దేవుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చ్యురీకి తలరించారు. కేసు దర్యాప్తు లో ఉంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699.** Cell: 9492148733